# మహిళా దశాబ్దంలో ఒక కథ లేక నవ నిర్మాణం

జీవితంలో కష్టాల్నీ, బరువు బాధ్యతల్నీ ఎరగాల్సిన అవసరం లేకుండా పెరిగే పై తరగతుల పుత్రికలు మా అమ్మాయి అరుణ ఫ్రెండ్స్ చిత్రలూ, హేమలూ, అరుణలూ, ప్రతిమలూ. వాళ్లని చూస్తే నాలో ఉత్సాహం పుట్టుకొస్తుంది. ఆ మహాజీవశక్తి యొక్క అందాన్ని, ఆనందాన్ని, ఆటనూ, ధీమానూ - అన్నిటినీ అట్లట్లే మోసుకొస్తున్న జీవకళలాలుగా కన్పిస్తారు వాళ్లు నా కళ్లకి. అన్ని విలువలకూ పైనున్నది తామేనన్న ధీమాతో దేన్నీ లక్ష్యపెట్టకుండా - అన్నిటినీ చూచి నవ్వుతూ - ఆ నవ్వు వలననే అన్ని విలువల కంటూ పైకెదిగి ఎత్తున నిల్చొని - ఆ పదమూడేళ్ల ఆడపిల్లలు ప్రపంచాన్ని ఏలే రాణులు! యువతరం, నవతరం, నవనవోన్మేషంగా ఎదగబోయే తరం!

అందర్లోకీ ఎక్కువ చురుగ్గా వుంటూ, క్లాసులో అన్ని సబ్జెక్టులలోనూ ఫస్ట్ మార్కులు తెచ్చుకుంటూ, నిజం అన్నపదానికి ఉనికే లేనట్లు హాయిగా, తేలిగ్గా గప్పాలు మాట్లాడేస్తూ వుండే పిల్ల మహామాయ. తెల్లగా, బొద్దుగా, ఆకర్షణీయంగా ఉంటుంది. ఆ పిల్ల కళ్లల్లో కనిపించే నిర్లక్ష్యం నన్ను తికమకపెట్టినా మహామాయ అంటే నాకు యిష్టం. ఎంత హేలగా జీవితంలో గెలుస్తున్నది! ఎంత నిశ్చింతగా నవ్వుతూ వుంటుంది! ఎంత సులువుగా చదువులో నెగ్గుతున్నది! ఆ పిల్లని బంధించగలది ఏదీ నాక్కనపడలేదు.

కాని నేను చూస్తుండగానే ఆ పిల్లలో నవ్వు మాయమైపోయింది. ఆట పోయింది. ధీమా లోపించింది. తల ఎగరేస్తూ, నవ్వుతూ, త్రుళ్లుతూ, స్నేహితులతో గప్పాలు కొట్టుకుంటూ వుండే పిల్ల స్కూలు బస్సు కోసం ఏ షాపు ముందరో తల వంచుకు కూర్చుని, వీలైతే తన శరీరాన్ని భూమి లోపలికి తోసేద్దామని ప్రయత్నిస్తున్నట్లుగా ముడుచుకుపోయి కనిపిస్తున్నది. దానిక్కారణం మా అమ్మాయి అరుణ చెప్పింది. వాళ్ల క్లాసులోని అబ్బాయిలూ, మిగతా క్లాసుల బడుద్ధాయిలూ కూడా ఆ అమ్మాయి కనిపించగానే వెకిలిగా నవ్వుతూ 'వెలగపళ్లు' అంటున్నారట. ఈ మూకుమ్మడి దండయాత్రను ఎదుర్కోవడం ఆ పిల్లకు చేతగాక ఒరిగిపోయింది.

ఈ సంఘంలో స్త్రీత్వం పవిత్రమైనది, గోప్యమైనది అంటూనే దాన్ని తమ వెకిలితనానికి, దుష్ట కామానికి, నీచత్వానికి, పశుత్వానికి బలి చేస్తున్నారు. స్త్రీకి ఆత్మరక్షణకు,

ఆత్మగౌరవం నిలుపుకోవడానికి అవకాశమే లేదు! ఈ అన్యాయం యిలా కొనసాగ వలసిందేనా? స్త్రీలందరూ కలిసి దీనికి నివారణోపాయం సాధించలేరా?

"మహిళా దశాబ్దం కదండీ. అందుకని మూడు రోజుల పాటు పెద్దఎత్తున మీటింగులు జరుపుతున్నాం. మన ఎం.ఎల్యే అవతారంగారు ఈ విషయంలో చాల సహాయం చేస్తున్నారు. మీరు చదువుకున్నవారు గనుక - ఒక్కపూట- ఉదయం అందరూ ఆడవాళ్లే వుండే మీటింగేలెండి - అందులో మాట్లాడాలి. జిల్లా నలుమూలల నుంచి చాలమంది డెలిగేట్లు వస్తారు. స్త్రీల హక్కులను గురించి సభలు జరిపి, చర్చించి, ఏదో ఒకటి చెయ్యకపోతే మనకి విముక్తి ఎలా వస్తుంది చెప్పండి!" అన్నదామె.

"నాకు మీటింగుల్లో మాట్లాడటం అలవాటే లేదు. కాని స్త్రీలహక్కుల కోసం పోరాడవలసిన అవసరం చాలా వుంది. స్త్రీల మీటింగ్ అంటున్నారు కదా, సరే, వస్తానులెండి" అనేశాను.

కాని ఏం మాట్లాడాలన్నది సమస్యే. ఇప్పుడు వరకట్ననిషేధం గొప్ప చర్చల్లో ఉన్నది.

ఆయన సలహా కోసం కాదుగాని, వూరికే ఆయన గదికి వెళ్ళాను. "ఏమిటి చదువుతున్నారు?" అన్నాను.

"ఇదొక కొత్త సిద్ధాంతం. సంఘాన్ని ముందుకు నడిపేది వ్యక్తా? లేక సంఘమా? అన్న వాదన వున్నది కదా. ఈ పుస్తకం ప్రకారం సంఘాన్ని ముందుకు నడిపేది వ్యక్తీ కాదు, సంఘమూ కాదు. వ్యక్తీ, సంఘమూ ఎదుర్కొన్నప్పుడు ఏర్పడే ఒక నవనిర్మాణం నడుపుతుందని..."

తొందరగా ఈ ఉపన్యాసానికి అడ్డుకట్ట వెయ్యాల్సిన అవసరం కన్పించింది. అందుకని గబగబా "ఇది మహిళా దశాబ్దం..." అన్నాను. ఆయన ఉత్సాహంగా "అవును. అదీ యీ సిద్ధాంతానికి సంబంధించిందే. స్త్రీల విషయంలో ముందుకు కదలటం అనేది జరగటం లేదు. ఎందుకంటే ఎవరి లోకంలో వారు కూర్చుని పాతభావాల్లో కూరుకుపోయి బయటకు రానంటారు. వ్యక్తి సంఘంతో ఢీకొంటే గదా నవనిర్మాణం ఏర్పడేది!" అన్నారు. ఇహ లాభం లేదని "నేను మీటింగులో వరకట్న నిషేధం మీద మాట్లాడాలి" అన్నాను.

"మాట్లాడు. ప్రపంచం డబ్బు ప్రాతిపదికగా నడుస్తున్నది. పరిస్థితుల్ని బట్టి ఎవరెవరి జీవితాలు వాళ్లు ఏర్పాటు చేసుకుంటారు. పెళ్లి కూడా ఒక ఏర్పాటు. మనిషికీ, సంఘానికీ, దేశానికీ, ప్రపంచానికీ కూడా యింకా, యింకా డబ్బు సంపాదించాలి, డబ్బు యిచ్చే సుఖాలు కావాలి, కీర్తి అధికారాలూ కావాలి అన్న యావే వున్నది. అలాంటప్పుడు యీ ఒక్కవిషయంలో మాత్రం 'డబ్బు ముఖ్యం కాదు అబ్బాయిలూ, అలా అనుకోవటం కుసంస్కారం!' అని వాళ్లకు హితబోధ చెయ్యాలనుకుంటే, అమ్మాయిలకు 'మీకు డబ్బుండే

మొగుడు అక్కర్లేదు, మామూలు మొగుడు చాలు' అని చెప్పాల్సి వస్తుంది... కనుక యింకా మూలానికి వెళ్ళాలి... గుంపు కట్టడంలో పవర్ వుందనేది అందరూ ప్రయోగిస్తున్న బ్రహ్మాస్త్రమే. స్త్రీలూ అదే పని చెయ్యొచ్చు" అనేసి పుస్తకం పుచ్చుకున్నాడు.

ఈయన స్త్రీల వైపునుంచీ ఆలోచించటం లేదు! అసలీయనగారి సలహా కావాలని నేనడిగానా? అదీగాకుండా పురుషులందరూ స్వార్థపరులు. వాళ్ల రక్తంలోనే స్వార్థశయం ప్రవహిస్తున్నది. అటువంటివాళ్లు యింతకంటే ఉదారంగా ఎందుకాలోచిస్తారు? మా ఆలోచన మేమే చేసుకోవాలి!

స్త్రీలకు స్వాతంత్ర్యం వుండే సంఘస్వరూపం ఎలా వుండొచ్చు?... ముఖ్యంగా శారీరకమైన బలమూ, ఆర్థిక భద్రతా వుండి తీరాలి... ఒకరిస్తే పుచ్చుకునే ఆస్తిహక్కులు కాదు, తన కాళ్ల మీద తాను నిలబడగల అవకాశం వుండాలి... ఉద్యోగాల్లో ఎక్కువభాగం స్త్రీలకు కేటాయిస్తే తప్ప యీ పరిస్థితి నుంచీ బయటపడలేరు. అప్పుడు స్త్రీలు మంచి వ్యవస్థను ఏర్పరచుకోవాలి... ఇంతదాకా ఆలోచించేసరికి సోషల్ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే శ్రీలక్ష్మి అన్న మాటలూ గుర్తుకొచ్చాయి. కరప్షన్‌లో స్త్రీలు పురుషుల్ని మించిపోయి, మరీ నిర్దాక్షిణ్యంగా వుంటున్నారని అన్నది... అవును పురోగతికి అంకితభావం యెంతో అవసరం. ఆ విషయం మీదనే ఉపన్యాసం తయారుచెయ్యాలి!

## 2

మీటింగ్ హాలు బ్రహ్మాండంగా వుంది. చాలా ఎత్తుగా, చాల పెద్దగా ఉంది. ప్రతి డెస్క్ ముందు మైకులున్నాయి. అందులో షుమారుగా వందమంది స్త్రీలు రంగు రంగుల చీరెల్లో కనులపండువుగా వున్నారు. నిస్సందేహంగా భారతదేశం పురోగమిస్తున్నది!

అంత ఘనంగా వున్న హాల్లో ప్రవేశించడానికి నాకు జంకు కలిగింది. అసలు 'గుంపు' అంటేనే నాకు భయం. అర్థం కాని భయం. 'నేను సుమతిని. ఫస్ట్‌క్లాస్ సైన్స్ గ్రాడ్యుయేట్‌ని. చాలా తెలివిగలదాన్ని. ప్రతిభావంతులైన లాయర్ కేశవమూర్తిగారి భార్యని. మా అమ్మాయీ, అబ్బాయీ చదువులో మహా ఘటికులు' అని వరుసగా అన్నీ జ్ఞాపకం చేసుకున్నాను. కొంచెం ధైర్యం వచ్చినట్లయింది. నా సమర్థతనే మననం చేసుకుంటూ ధైర్యంగా గబగబా లోపలికి వెళ్లి కూర్చున్నాను.

అరగంట ముందు మీటింగ్ ప్రారంభమై వుండాల్సింది. కాలేదు. హాల్లో ఏదో గొడవ వున్నట్లు అనిపించింది. కారణం తెలియడంలేదు.

"ఆ అవతారం అంత అసభ్యంగా మాట్లాడాడా! ఏం మాట్లాడాడూ?"

"ఆడవాళ్లంటే నాకు చాలా యిష్టం. మీరు లేనిదే ప్రపంచం లేదు. ఆనందం లేదు. మీరు సుఖంగా వర్ధిల్లాలనేదే నా కోరిక. మీరు పురుషులతో సమానత్వం కోరుతున్నారు. ఒక మనిషీ ఇంకో మనిషీ సమానంగా వుండటం సృష్టిలోనే లేదు. ఇద్దరు మనుషులుంటే

ఒకరు పైనా ఒకరు క్రిందా వుండాల్సిందే. తప్పదు. స్త్రీలు బైట ప్రపంచంలో పురుషుల కంటే పైన వుంటామంటున్నారు. కాని ఒక్కచోట మాత్రం... అన్నాడండీ!"

"నిజంగా?! ఆ మీటింగ్‌లో నేనూ వున్నానండి. ఏమిటో అందరూ నవ్వుతున్నారనుకున్నానుగాని, వెర్రిమొద్దుని నాకు అర్థం కాలేదు."

"అతన్ని గర్హిస్తూ తీర్మానం ప్రవేశపెట్టాలనుకుంటున్నారు యీ మీటింగ్‌లో"

పై సంభాషణ వెనుక బెంచీలో నుంచీ వినబడింది. హాల్లోని చర్చ అది. ఇంతటి ఘోరావమానం ముందు అసలు మీటింగ్ అప్రస్తుతంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో నేను జాగ్రత్తగా తయారుచేసి తెచ్చిన వ్యాసం ఎంత అసందర్భంగా వుంది! స్త్రీలకు ఇటువంటి వ్యవస్థలో ముందూ, వెనకా ఏమిటి?

మరో అరగంటకు మీటింగ్ ప్రారంభమైంది. ఛైర్మన్‌గారి భార్య కనకమ్మగారు ప్రెసిడెంట్. ఆమె, వక్తలిద్దరమూ వేదికనలంకరించాము.

ఒకామె హడావుడిగా వచ్చింది. కనకమ్మగారితో చెప్పి, ఒక చిన్న ఎనౌన్స్‌మెంట్ చేసింది - "మహిళా సంక్షేమశాఖ మంత్రిగారు మహిళల కోసం కో-ఆపరేటివ్ స్టోర్స్ ప్రారంభోత్సవం చేస్తున్నారు. అక్కడ ప్రేక్షకులు నలుగురు కూడా లేరు. కనుక డిపార్ట్‌మెంట్ ఉద్యోగినులందరూ  దయచేసి రావాలి."

సభికుల్లో నుంచీ యాభైమంది స్త్రీలు లేచి వెళ్లిపోయారు.

కరెంట్ పోయింది. మైకులు పనిచెయ్యలేదు.

మొదటి వక్త రూన్సీబాయి లేచి పురాణ కాలం నుంచీ స్త్రీలకు యీ దేశంలో వున్న పూజనీయ స్థానం గురించి బాగా చెప్పింది. ఉద్వేగంతో, ఆవేశంతో చాలా ఘాటుగా మాట్లాడింది.

తర్వాత నేను లేచాను. స్త్రీలు ఆర్థికంగా స్వశక్తి మీద ఆధారపడగలిగినప్పుడే యిప్పుడున్న పరిస్థితుల్లో నుంచీ బయటపడగలరని చెపుతూ, యిప్పుడు ఉద్యోగినులుగా వున్నవారు కర్తవ్య నిర్వహణ సరిగ్గా చెయ్యకపోతే స్త్రీ జాతికే చెడ్డపేరు వస్తుందనీ, లేడీ టీచర్లు స్కూల్లో సరిగ్గా వుండరనీ, శ్రద్ధగా పాఠాలు చెప్పరనీ ప్రజల్లో వ్యాపించివున్న అభిప్రాయం గురించి చెప్పాను. శ్రోతల్లో ఎక్కువమంది ఆవులింతల్నాపుకుంటున్నట్లు అనుమానం కలిగింది నాకు. ఇంతలో ఒకామె మైకు దగ్గరకు వచ్చి "టీచర్స్ మధ్యాహ్నం స్కూలుకు వెళ్లాలి గనుక వారు లేచి యిళ్లకు వెళ్లిపోవచ్చు" అని ప్రకటించింది.

ముప్ఫై మంది శ్రోతలు ఠక్కున లేచి బయల్దేరారు. అందరూ టీచర్లేనా, పుర ప్రజలు కారా? అనుకుని గతుక్కుమన్నాను. కొద్దిమంది మాత్రం మిగిలారు.

సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు వారు నిర్వహిస్తున్న అనాథ శరణాలయాల్లో గవర్నమెంటు యిచ్చిన మంచి బియ్యం మాయమై, వాటి బదులు ముక్కిపోయిన ఎర్రబియ్యం వాడబడటం ఆదిగా గల అపసవ్యాల గురించి చెప్పాను.

నా ప్రక్కనే కూర్చుని వున్న ఝాన్సీబాయి కస్సుమంటూ లేచింది. 'అక్కడి పరిస్థితులు మీకేం తెలుసు? పరిస్థితుల్ని బట్టి ఎన్నో సర్దుబాట్లు అవసరం అవుతాయి' అన్నది.

ముందు బెంచీలో ఒకరిద్దరు కూడా ఏదో అరవటం ప్రారంభించారు. సోషల్ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్ యింకా కొంత మిగిలి వున్నట్లుంది. ప్రెసిడెంట్ కనకమ్మగారు ఆమె ఉపన్యాసం పూర్తయ్యాక కావాలంటే సమాధానం చెప్పండి అన్నా విన్పించుకోలేదు.

గబగబా స్త్రీ జనోద్ధరణకు కావల్సిన నాలుగు తీర్మానాలంటూ చదివేశారు. వాటిల్లో అవతారంగారి ప్రసక్తి లేదు. అందరూ లేచేశాం.

ఝాన్సీబాయి ఇంకా నన్ను దులిపేస్తూనే ఉంది. 'స్త్రీలు స్త్రీలను విమర్శించట మేమిటి పిచ్చిగ్గా? మీలాంటి వాళ్ల వల్లనే స్త్రీ జాతికి చెడ్డపేరు వస్తున్నది' అన్నది.

నాకు కోపం వచ్చింది "నేను అపసవ్యాల గురించేగాని అమానుషాల గురించి చెప్పలేదు. నేను చెప్పిన కరప్షన్ సముద్రంలో నీటి బొట్టంత. పతితల్నీ, అనాథల్నీ ఉద్ధరిస్తామంటూ తెచ్చి గవర్నమెంటు ఖర్చు మీద వ్యభిచార గృహాలు నడుపుకుంటున్నవాళ్ల మాట చెప్పలేదు" అన్నాను.

కనకమ్మగారి చుట్టూ ఆరాధనాపూర్వకంగా చేరినవారిలోంచి ఒక లావుపాటామె బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ వచ్చి నా మొహంలోకి చేతులు ఝాడిస్తూ "ఈ వూళ్లో వీధికొకటి అలాటి లాడ్జి వుంది. వాళ్లనే తప్పు పట్టటమెందుకు?" అన్నది.

యుద్ధ రంగంలోకి దూకుతున్న వీరుడిలాగా ముందు ముందుకు వస్తున్న ఆమెనూ, ఆమె మాటల్నీ చూస్తే నాకు భయం కలిగింది.

కనకమ్మగారి బొమముడి చూసి వెనక్కు మళ్లిందామె.

బ్రహ్మాండమైన జిల్లాస్థాయి మహిళా సమావేశం ముగిసింది.

## 3

ఇంటికొచ్చినా ఆ దిగ్భ్రాంతిలో నుంచీ బయటపడలేకపోయాను. నన్ను నేను తమాయించుకొని, జరిగిన విషయం లాయరు కేశవమూర్తిగారికి వినిపించడానికి కష్టమైంది. దేవుళ్లో వర్ణించడానికి మాటలు లేనట్లే, లావుపాటామె ఆలోచనా విధానం గురించి చెప్పడానికీ మాటలు చాలలేదు.

అన్నీ విన్న కేశవమూర్తిగారు ఆశ్చర్యంలో మునిగిపోలేదు. పైగా నవ్వుతూ "మంచి పనే జరిగింది. ఇంట్లో కూర్చుని ఆదర్శాలు మాట్లాడటం కాదు. స్త్రీ జాతిని ముందుకు నడపబోయే నవనిర్మాణానికి అంకురం ఏర్పడుతున్నట్లే" అన్నారు.

ఏంతైనా మగజాతి మగజాతే!

★★★